క్లుప్తంగా

నేడు కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి రాక



మంగళగిరి: యర్రబాలెం శ్రీనగర్ కాలనీ లక్ష్మీ సూర్యా ఎస్టేట్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమానికి కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి సోమవారం విచ్చేయనున్నట్లు కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో వారు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల పర్యటనలో భాగంగా కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి నగర పరిధిలోని యర్రబాలెం శ్రీనగర్ కాలనీ విచ్చేయనుండటం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. భక్తులనుద్దేశించి శంకర విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం చేయనున్నారని, లోక కల్యాణార్థం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో కార్యనిర్వాహక కమిటీ సభ్యులు డాక్టర్ విష్ణుబొట్ల సుబ్రమణ్యం, జి.కామేశ్వర శర్మ, నటరాజ శర్మ, వి.హరినారాయణ, రాధాకృష్ణ, నరసింహరావు, బాబ్జి పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ..



మంగళగిరి: బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరానగర్‌లో ఆదివారం ఇంటింటికీ బీజేపీ... గ్రామ గ్రామాన ఓబీసీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగ్గారపు శ్రీనివాసరావు, పంచుమర్తి ప్రసాద్, తులిమెల్లి రామకృష్ణ, ఆకురాతి నాగేంద్ర, మాదల వెంకట కృష్ణ, రాకేష్‌జి తదితరులు పాల్గొన్నారు.


ద్విచక్ర వాహనం చోరీ

మంగళగిరి: స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పార్కింగ్ చేసిన ఓ ద్విచక్ర వాహనం ఆదివారం చోరీకి గురైంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నగర పరిధిలోని నవులూరు ఉడా కాలనీకి చెందిన మస్తాన్‌రావు తన ద్విచక్ర వాహనాన్ని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట పార్కింగ్ చేశాడు. రెండు గంటల అనంతరం తిరిగి వచ్చి చూసే సరికి తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: నేడు తాడేపల్లి పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తాడేపల్లిలోని అవర్ ప్యాలెస్ రోడ్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 అత్యవసర విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



నిజాంపట్నం: వాసవీ క్లబ్ నిజాంపట్నం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరం అభినందనీయమని ఎంపీ మోపిదేవి సోదరుడు మోపిదేవి హరనాథబాబు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ నిజాంపట్నం, రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం ఆధ్వర్యంలో శంకర్ కంటివైద్యశాల సహకారంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని హరనాథబాబు ప్రారంభించి మాట్లాడారు. శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 295 మంది రోగులు పాల్గొన్నారు. 202 మంది శస్త్ర చికిత్సకు అనుమతి పొందారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.గౌరీశంకర్, వైస్ చైర్మన్ బాబ్జీ, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ బి.శ్రీనివాసరావు, సెక్రటరీ హనుమాన్, గోపీ, మహేంద్రకుమార్, నాజర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో గుర్తుతెలియని మృతదేహం

తెనాలిరూరల్: రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన ప్రయాణికులు అధికారులకు సమాచారమందించారు. రేపల్లె నుంచి కాచిగూడ వెళ్లే డెల్టా ఎక్స్‌ప్రెస్‌లో శనివారం రాత్రి ఎస్1, ఎస్2 బోగీల మధ్య లింక్ వద్ద ఉండే రేకుపై మృతదేహం ఉండడాన్ని ప్రయాణికులు గుర్తించారు. రైలు తెనాలికి చేరుకోగానే అధికారులు మృతదేహాన్ని రైలు నుంచి దింపి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడి వయసు సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుంది. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న పాలన..మా భవిష్యత్తుకు నమ్మకం

- ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్' ప్రజా మద్దతు ప్రచారం
- రాష్ట్ర ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు
- ఇంటింటికీ తిరుగుతూ.. ప్రజాభిప్రాయం తెలుసుకుంటున్న నేతలు
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు అపూర్వ స్వాగతం



మంగళగిరిలో నియోజకవర్గ పరిశీలకుడు రాజనారాయణ, నేతల ప్రచారం



కొప్పురావు కాలనీలో రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి..



ప్రచారం నిర్వహిస్తున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, నాయకులు



కరపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సిద్దయ్య, కన్వీనర్ అబ్బాస్

తాడేపల్లిరూరల్: ఏ ఇంటికి వెళ్లినా..అదే మాట.. ఏ ఒక్కరి పలకరించిన ఒకటే స్పందన.. 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రజా నినాదంగా మారిందని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు నిమ్మకాయల రాజ నారాయణ పేర్కొన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో పార్టీ నాయకులతో కలసి ఆయన మా నమ్మకం నువ్వే జగన్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ.. అన్నివర్గాలకు లబ్ధిచేకూరే విధంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతి గడపకు తెలిజేయాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల తాలూకు వడ్డీలు ఏ విధంగా ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తుందో ప్రజలకు అర్థమయ్యేట్లు చెబుతున్నట్లు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను కూడా ఆయన చేసి చూపిస్తున్నారని వెల్లడించారు. వడ్డేశ్వరంలోని పలు కుటుంబాలను కలిసి వారితో మాట్లాడారు. ప్రతి ఇంటికి 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అంటించారు. పార్టీ రూరల్ యువజన నాయకుడు మున్నంగి వివేకానందరెడ్డి, బీసీ సెల్ జిల్లా నాయకుడు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు, పార్టీ కన్వీనర్ గొడవర్తి శ్రీనివాసరావు, కుంచనపల్లి పార్టీ కన్వీనర్ మిరియాల రాంబాబు, సాంబిరెడ్డి, మైనార్టీ నాయకులు మీర్‌షా, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని మెల్లెంపూడి, గుండిమెడ, చిర్రావూరు ప్రాంతాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండిమెడ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అర్జునరావు, చిర్రావూరు పార్టీ కన్వీనర్ మేకల సాంబశివరావు, ఏసు ప్రసాద్, బాజీ గంగాధర్, నామతోటి కోటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు' అంటున్న జనం

మంగళగిరి: పట్టణంలోని కొప్పురావు కాలనీలో రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి ఆధ్వర్యంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ అందించిన ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకున్నారు. ఇంటి పెద్దతో ఫోన్ ద్వారా మిస్డ్ కాల్ ఇప్పించారు. నగరంలోని యర్రబాలెం పరిధిలో పార్టీ నాయకుడు గుండాల శ్రీనివాసరావు, పలగాని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మేరిగ నాగేశ్వరరావు, చిల్లపల్లి శ్రీరాములు, సాలి బంగారయ్య తదితరులు పాల్గొన్నారు. నీరుకొండ శిబిరంలో పార్టీ నాయకులు సాలి ప్రశాంత్, కురగంటి ఆదామ్, కురగంటి రాజేష్, నాగేంద్రమ్మ ప్రచారం నిర్వహించారు.

పేదరిక నిర్మూలనే సీఎం లక్ష్యం..

మేడికొండూరు: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ – జగనన్నే మా భవిష్యత్ ప్రచార కార్యక్రమం డోకిపర్రు పంచాయతీలో ఆదివారం నిర్వహించారు. మండల సచివాలయాల కన్వీనర్ షేక్ అబ్బాస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ కందుల సిద్దయ్య పాల్గొని, ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ కరపత్రాలు పంపిణీ చేసి, స్టిక్కర్లు అంటించారు. వైఎస్సార్ సీపీ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. డోకిపర్రు సచివాలయం కన్వీనర్ ఉడతా ప్రభాకర్, వలంటీర్ ఉడతా ధనుంజయ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోటా బాజి, బుర్రా సుబ్బారెడ్డి, జయరావు, సంకు రత్తయ్య, పేరేచర్ల ఎంపీటీసీ శ్రీనివవాసరావు, గుర్రం శివయ్య, నాగేశ్వరరావు, గుంటుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నవులూరులో..

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరులో ఏఎంసీ మాజీ పర్సన్ దొడ్డక శివపార్వతి ఆధ్వర్యంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. వార్డు కన్వీనర్లు కృష్ణ, బాషా, భవాని, నాయకులు గంగయ్య, వాసు, పానయ్య, నాగరాజు, గౌతమ్, షేక్ మబ్బుల్ పాల్గొన్నారు.

ఆప్కో చైర్మన్ ప్రచారం..

మంగళగిరి: ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి నగర పరిధిలోని రత్నాల చెరువులో ఆదివారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పనితీరును వివరించారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం కార్యదర్శి మల్లవరపు సుధారాణి, వార్డు కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.

నందివెలుగులో ఉచిత గుండె వైద్యశిబిరం



తెనాలిటౌన్: నందివెలుగులో మేముసైతం యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో హెల్ప్ హాస్పిటల్ విజయవాడ సౌజన్యంతో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ ప్రారంభించారు. వైద్యశాలకు చెందిన కార్డియాలజీ డాక్టర్ సాయిరెడ్డి బృందం వైద్యులు సుమారు 246 మందికి గుండె పరీక్షలు చేశారు. ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి యాంజియోగ్రామ్, టీఎంటీ పరీక్షలు చేశారు. తీవ్రమైన సమస్యలుంటే శస్త్రచికిత్సలూ ఉచితంగా చేస్తామని డాక్టర్ సాయిరెడ్డి తెలిపారు. సర్పంచ్ పవన్‌కుమార్ మాట్లాడుతూ మేముసైతం సభ్యులు చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో మేముసైతం అధ్యక్షులు కల్యాణం సాంబశివరావు, ఉపాధ్యక్షులు ఎర్రమోతు జగన్మోహనరావు, ప్రధాన కార్యదర్శి షేక్ షకూర్‌బాషా, నరసింహారావు, వెంకటనరసయ్య, హనుమంతరావు, కల్యాణ్‌కుమార్, సత్యనారాయణ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

తెనాలిటౌన్: బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద 'అన్నదాత సుఖీభవ' తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని పట్టణ వన్‌టౌన్ సీఐ చంద్రశేఖర్ ప్రారంభించారు. వేసవి వరకు చలివేంద్రంలో మజ్జిగ, మినరల్ వాటర్ అందిచనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. చలివేంద్రం నిర్వహణకు సహకరిస్తున్న వారికి ఓలేటి వెంకట ప్రతాప్ ధన్యవాదాలు తెలిపారు.

పోరాట యోధుడు రాజేశ్వరరావు



రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిన వ్యక్తి చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సీపీఐ నాయకులు చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతిని గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ రాజేశ్వరరావు సేవలను కొనియాడారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రజా నాట్యమండలి, అభ్యుదయ రచయితల సంఘ సంయుక్త ఆధ్వర్యంలో తెనాలిలోని పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో కళాకారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు గని, సీపీఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, పట్టణ కార్యదర్శి సాయి, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి పల్నాటి నాగరాజు, పట్టణ కార్యదర్శి బిళ్ళ రాజేష్, నాయకులు రవితేజ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాటలను ఆలపిస్తున్న గాయకులు

పాత గుంటూరు: రాజాగారితోటలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కళాంజలి వ్యవస్థాపకుడు తొట్టెంపూడి రమేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఎన్టీఆర్ గానామృతం పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. ఎన్టీఆర్ సినిమాలోని పాటల్ని గాయకులు రమేష్, స్టాలిన్, రసూల్‌బాబు, శివలీల, భారతి ఆలపించారు. ఎం.ఎస్. బాబు సంగీతాన్ని అందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, కళారంగంలో బి. వేదయ్యకు ఎన్టీఆర్ పురస్కారాన్ని అందించి సన్మానించారు. కార్యక్రమంలో చందు సాంబశివరావు, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మిరియాల ప్రసాదరావు పాల్గొన్నారు. ఎస్‌కె. ఇస్మాయిల్, పెళ్లూరి కృష్ణారావు పర్యవేక్షించారు.

దశాబ్దాల సమస్యకు..గంటల్లో పరిష్కారం

- ఎంఎస్ఎస్ కాలనీ సమస్య తీర్చిన ఎమ్మెల్యే ఆర్కే
- రోడ్డు వేయించి, మురుగు సమస్యకు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ఇటీవల పర్యటనలో మురికి కాలువగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే



ప్రస్తుతం గ్రావెల్‌తో అభివృద్ధి పరచిన రోడ్డు

నవులూరు(మంగళగిరి): నగర పరిధిలోని నవులూరు ఎంఎస్ఎస్ కాలనీ నిర్వాసితుల సమస్య ఎట్టకేలకు తీరింది. నగరానికి కూత వేటు దూరంలో ఉన్న నవులూరు ఎంఎస్ఎస్ కాలనీ వాసులు సుమారు 3 దశాబ్దాలుగా సరైన రోడ్డు, డ్రెయిన్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నవులూరుతో పాటు ఎంఎస్ఎస్ కాలనీలో పర్యటించారు. కాలనీలోని 1వ లైను నిర్వాసితులు తమకు రోడ్డు లేకపోగా.. ఆ ప్రాంతంలో మురుగు చేరడంతో బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దోమలు, పందులు, పాములు చేరడంతో పాటు దుర్వాసనతో కనీసం భోజనం చేయలేకపోతున్నామని ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. కల్వర్టు ఏర్పాటు చేసి, గ్రావెల్ రోడ్డు నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే కాలనీకి గ్రావెల్ రోడ్డు వేసి, కల్వర్టు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. ఆయన సూచనతో స్పందించిన అధికారులు వెంటనే పనులు ప్రారంభించారు. 24 గంటలలో పైపులైను, గ్రావెల్ రోడ్డుతో పాటు కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు.

ముప్పై ఏళ్లుగా తీరని సమస్య..



ముప్పై ఏళ్లుగా ఇక్కడ నివాసముంటున్నాం. కనీసం రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నిసార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులు చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి సమస్యను తీసుకెళ్లిన రోడ్డు, పైపు లైన్లు, కల్వర్టు నిర్మాణాలు పూర్తి చేశారు. కాలనీ వాసులంతా ఎమ్మెల్యే ఆర్కేకు రుణపడి ఉంటాం.

– మగ్గోలు బాజి, స్థానికుడు

బయటకు వెళ్లాలంటనే



మహిళలు, పిల్లలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. కనీసం మురుగు కాలవ పూడ్చి రోడ్డు వేసే నాథుడు కనిపించలేదు. మురుగు కంపులో దోమలు, పందులు, పాములతో బెడద అధికంగా ఉంది. ఎమ్మెల్యే ఆర్కే చొరవ తీసుకుని గ్రావెల్ రోడ్డు, పైపులైను, కల్వర్టు నిర్మించి మా బాధలను అర్థం చేసుకున్నారు.

– శివ కుమారి, స్థానికురాలు

లోక రక్షకుడా.. పునరుత్థానుడా..



దివ్య పూజాబలి నిర్వహిస్తున్న జిల్లా మేత్రాసన గురువు చిన్నాబత్తిన భాగ్యయ్య



ప్రత్యేక ప్రార్థనలో మహిళలు

- ఘనంగా ఈస్టర్ పండుగ వేడుకలు..
- ఏసు రాకను ఆహ్వానిస్తూ..భక్తుల ప్రత్యేక ప్రార్థనలు
- దేవ సందేశమిచ్చి..రుజుమార్గం చూపిన సంఘ కాపరులు

ఫిరంగిపురం: క్రీస్తుమార్గం సకల మానవాళికి రక్షణ మార్గం అని జిల్లా మేత్రాసన గురువులు చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో క్రీస్తు పునరుత్థానం(ఈస్టర్) సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున దివ్యపూజా బలి కార్యక్రమం నిర్వహించారు. ఆయన వాక్యోపదేశం చేస్తూ క్రీస్తు పునరుత్థానంతో మానవుడికి పరలోక రాజ్య ప్రవేశంతో పాటు నిత్యజీవం పొందుతారని చెప్పారు. ఉత్థానుడైన క్రీస్తు మరణాన్ని జయించి సజీవుడై లేచారని తెలిపారు. అనంతరం దివ్య పూజాబలి నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ విచారణ గురువు పామిశెట్టి బాలస్వామి, సహాయ విచారణ గురువు చొప్పర కిషోర్‌బాబు, మఠకన్యస్త్రీలు, గుడిపెద్దలు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.

మంగళగిరి: నగరంలో ఆదివారం ఘనంగా ఈస్టర్ పండుగ ప్రార్థనలు నిర్వహించారు. పార్కు రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి, బాప్టిస్ట్ పేట చర్చి, హోలి లార్డు పెంతెకోస్తు చర్చి, లూథరన్ టౌన్ చర్చిల్లో ఫాస్టర్లు, సంఘ కాపరులు దైవ సందేశం ఇచ్చారు. విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రార్థనలు నిర్వహించారు.

తాడేపల్లిరూరల్: ఈస్టర్ పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏసు ప్రభువు పునరుత్థానమైన రోజు కావడంతో చర్చిల్లో, తమ నివాసాల్లో పెద్దలను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో, 1వ వార్డు మేరీ మాత చర్చి, బైపాస్ రోడ్డులోని లూథరన్ చర్చి, రూరల్‌లోని పెనుమాక, ఉండవల్లి, ప్రాతూరు, గుండిమెడ, వడ్డేశ్వరం, మెల్లెంపూడి, కొలనుకొండ చర్చిల్లో ఈస్టర్ ఏసు రాకను ఆహ్వానిస్తూ ప్రార్థనలు చేశారు.



పెనుమాక సమాధుల తోటలో పెద్దల స్మరణ..

దుగ్గిరాల మండలంలో చిలువూరు, తుమ్మపూడి, మంచికలపూడి, పెదపాలెం, గొడవర్రు తదితర చర్చిల్లో పాస్టర్లు దైవ సందేశం ఇచ్చారు.

తాడికొండ: క్రీస్తు పునరుత్థానం ఈస్టరు పండుగను పురస్కరించుకొని తాడికొండ, తుళ్ళూరు మండలాల్లోని చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు పునరుత్థానంను పాస్టర్లు విశ్వాసులకు వివరించారు. బంధుమిత్రులతో కలిసి తమ పూర్వీకుల సమాధులను పూలతో అలంకరించి, ప్రార్థనలు నిర్వహించారు.



లూథరన్ చర్చిలో సందేశమిస్తున్న పాస్టర్ జాకబ్



దైవ సందేశం ఇస్తున్న విచారణ గురువులు



తాడేపల్లి తెలుగు బాప్టిస్టు చర్చిలో.. ప్రత్యేక ప్రార్థనలో భక్తులు

మతాల ఐక్యతకు ప్రతిరూపం 'రెండు ఆకాశాల మధ్య'

పరిచయ సభలో ఆచార్య కృపాచారి



పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ కృపాచారి, పక్కన నాగేశ్వరరావు, సయ్యద్ సలీం తదితరులు

తెనాలి: హిందూ ముస్లింల ఐక్యతకు 'రెండు ఆకాశాల మధ్య' నవల ప్రతిరూపమని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత సయ్యద్ సలీం రచించిన 'రెండు ఆకాశాల మధ్య' పుస్తక పరిచయ సభ ఆదివారం స్థానిక కొత్తపేటలోని అదితి గ్రాండ్ హోటల్ కాన్ఫరెన్సు హాలులో నిర్వహించారు. శారద సాహితీ సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన సభకు డాక్టర్ కృపాచారి అధ్యక్షత వహించారు. తొలుత పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రెండు విభిన్న దేశాల మధ్య భిన్న సంస్కృతులు, ఆచారాలు చాటుతూ మానవతను, మనుష్యుల మధ్య ప్రేమను, సమాజ ఐక్యతను సలీం తన తాజా నవలలో చాటారని ఆయన అభినందించారు. మొత్తంమీద మానవత్వపు విలువల్ని చాటుతూ ప్రేమకు ప్రతిరూపంలా నిలిచిందన్న భావనకు పాఠకులు లోనవుతారని ప్రశంసించారు. రచయిత సయ్యద్ సలీం తన ప్రసంగంలో దేశవిభజన జరిగిన సందర్భంగా సరిహద్దులోని ఇరు దేశాలకు చెందిన రెండు గ్రామాలను కథాంశంగా తీసుకుని నవల రాసినట్టు తెలిపారు. మతంకన్నా మానవత్వం గొప్పది అనేది నవల సందేశంగా వివరించారు. యర్రంశెట్టి హనుమంతరావు స్వాగతం పలికిన సభలో ప్రముఖ బాల సాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని రచయితను పరిచయం చేశారు. రచయిత నూతలపాటి నాగేశ్వరరావు నవలా పరిచయం చేశారు. ఎల్.వెంకటేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, గోనుగుంట్ల మురళీకృష్ణ, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, పొత్తూరి నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ అందజేత

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణం 18వ వార్డుకు చెందిన భవిరిశెట్టి ధనలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్‌లో పది రోజుల నుంచి చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వార్డు వలంటీర్ రేష్మా అక్కడకు వెళ్ళి ఆమెకు వృద్ధాప్య పింఛన్‌ను ఆదివారం అందజేశారు.

వృద్ధురాలు నేత్రదానం

పెదనందిపాడు: ఓ వృద్ధురాలు నేత్రదానం చేశారు. పెదనందిపాడు గ్రామానికి చెందిన యెలిశెట్టి భాగ్యమ్మ(80) ఆదివారం గుండెపోటుతో మరణించారు. ఆమె కోరిక మేరకు శంకర్ నేత్రాలయం వారికి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. వైద్యులు నేత్రాలయకు తరలించారు.